# సత్య వాక్కు

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘములు
# సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో

మధ్యాహ్నం గం 2-30 కు

ఇంగ్లీషు THE VOICE OF TRUTH

సోమవారము 9-00 to 9-15 p. m.

బుధవారము 9-30 to 9-45 a. m.

హింది — SATYA SUSAMACHAR

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 p. m.

ఆదివారము — 1-30 to 1-45 p. m.

తమిళం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.

గురువారము, శుక్రవారము — 6-45 to 7-00 p. m.

మళయాళం — THE VOICE OF TRUTH

మంగళవారము, శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి:


**SATYA VANI**
P.O. Box. 80
KAKINADA - 533 001



రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

**Pleading for restoration of pure New Testament Christianity.**

సంచిక **11** జూన్ **1983** సంపుటి **3**


## సంపాదకీయము

### నేనేల క్రీస్తు సంఘ సభ్యుడ నైతిని

***( Why I am a Member of the Church of Christ )***

ప్రపంచంలో నేడు అనేక సంఘాలున్నవి. అన్ని సంగతులవలె ఇక్కడ కూడ అసలు ఆదిసంఘ మొకటి యున్నది, దాని అనుకరణ లనేకము లున్నవి. అసలుదానికంటె నకిలీది ఎన్నడు శ్రేష్టమైనది కాదు. క్రీస్తుకు చెందిన సంఘ విషయంలో ఇది మరింత సత్యం.

నేను క్రీస్తుసంఘ సభ్యుడను. దాన్ని గూర్చి సిగ్గుపడువాడను కాను. నేనెందుకు ఈ సంఘ సభ్యుడనైతినో మీకు చెప్పాలని కోరుచున్నాను.

మొదట, నేను బైబిలును తెరచునప్పుడు అది దానిలో కనబడు ఒకే ఒక్క సంఘం. నేనేదైనా సంఘసభ్యుడను కాగోరితే అది లేఖనార్థమైనదో కాదో తెలిసికొన గోరుదును. ఏదైనా ఒక సంఘాన్ని గూర్చి బైబిలులో మనం కనుగొన లేనియెడల అది మానవుని వలన కలిగిందేగాని ప్రభువువలన కలిగిందికాదు. మనము ఆయన సంఘ

సభ్యులము కావాలని క్రీస్తు కోరినయెడల తన వాక్యంలో దాన్ని గూర్చి ఆయన తప్పక చెప్పి యుండునుగదా. ఆయన చెప్పాడు. క్రీస్తు తన సంఘాన్ని కట్టుదునని వాగ్దానం చేసినట్టు (మత్త 16:18), రక్షింపబడిన వారిని ప్రభువే ఆ సంఘముతో చేర్చుచున్నట్టు (అపొ. కా. 2:47), లేఖనములు మనకు తెలియజేయు చున్నవి.

రెండోది. క్రీస్తు తన సంఘమును కట్టుదునని వాగ్దానం చేసాడు. నేనేదైనా సంఘసభ్యుడను కాగోరితే క్రీస్తుకట్టిన సంఘ సభ్యుడను కాగోరుదును. క్రీస్తు నిర్మించిన సంఘ సభ్యుడ నవగల్గునప్పుడు నేనొక మానవసంఘ సభ్యుడ నెందు కగుదును ? క్రీస్తుయొక్క సంఘముతో సరిసమానము కాగల సంఘాన్ని ఎవరు నిర్మించగలరు ? పేతురును తదితర అపొస్తలులును క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొన్న తరువాత యేసు ఇట్లనెను : "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నాసంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను" (మత్త 16:18). ఆయనే దేవుని కుమారుడను గొప్ప బండపై, సత్యముపై తన సంఘమును నిర్మింతునని చివరికి మరణముకూడా దాన్ని ఆపలేదని క్రీస్తు ఇక్కడ చెప్పాడు. తాను వాగ్దానంచేసిన రీతిగా ఆయన తన సంఘాన్ని కట్టాడా ? ఆయన దాన్ని కట్టాడని నమ్ము నిమిత్తం నీవు చేయవలసినదంతా అపొ. కా. 2వ అధ్యాయాన్ని చదవడమే. అక్కడ అపొస్తలులు రక్షణ సువార్తను బోధించారు, ఇంచుమించు మూడువేలమంది ప్రభువుకు విధేయులయ్యారు, సంఘముతో చేర్చబడ్డారు. అవును క్రీస్తుసంఘాన్ని కట్టాడు, తన సంఘాన్ని కట్టాడు. అది ఈనాటికీ యున్నది. నేనాయన సంఘ సభ్యుడనని చెప్పడానికి నాకు సంతోషంగా యుంది. నీవు, మిగతా వారందరు కూడ దానిలో సభ్యులు కావచ్చు. ఎవరైనా ఇంకో సంఘంలో సభ్యులుగా యుండుటకు ఎందుకు కోరుకొందురు ?

మూడోది. ఎవరైనా దానిలో యుండి మాత్రమే రక్షింపబడే సంఘమది. రక్షింపబడిన వారితో సంఘము సమకూడినది గనుక సంఘము రక్షించదు, నిజమే. దానిలో సభ్యులుకూడా రక్షించరు. గాని సంఘమను శరీరానికి క్రీస్తే రక్షకుడు. గనుక రక్షింపబడాలంటే ఒకడు ఆయన సంఘములో యుండాలి. క్రీస్తే శరీరానికి రక్షకుడని ఆ శరీరమే ఆయన సంఘమని అపొస్తలుడైన పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసీ 5:23; కొలస్స 1:18). రక్షింప బడినవారినే ప్రభువు తన సంఘముతో చేర్చునని అపొ. కా. 2:40 లో మనం చదువ గలము. గనుక ఎవడైనను ఆయన సంఘ సభ్యుడు కానియెడల అతడు రక్షింప బడలేదు. అది అంతసూక్ష్మం. క్రొత్త జన్మలో ఒకడు దేవుని రాజ్యములో లేక సంఘములో ప్రవేశించునని చెప్పబడినది (యోహాను 3:3-5; కొలస్స 1:13, 14). ఇంకోమాటలో ఒకడు తిరిగి జన్మించినప్పుడు ప్రభువు కుటుంబములోనికి జన్మించును.

నాలుగోది. క్రీస్తుకు ఒకే ఒక్క సంఘమున్నది. ఆ సంఘము అసంఖ్యాకమైన చీలికలై పోలేదు. తన ప్రజలు ఏకమై యుండాలని క్రీస్తు ప్రార్థించాడు (యోహాను 17:20-23). శరీరము లేక సంఘము ఒక్కటే, ఆత్మయు ఒక్కడే, నిరీక్షణ ఒక్కటే, ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మ మొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే యని పౌలు ప్రకటించాడు (ఎఫెసీ 4:1-6). సంఘములో అనేక స్థానిక సంఘాలున్నాయి. ప్రతి స్థానిక సంఘంలో అనేక క్రైస్తవులున్నారు. అయినను వారందరు ఏకమై యున్నారు. వారందరు ఒకే సంఘసభ్యు లయ్యారు. అదే సమయంలో లేఖనములు విభజనను ఖండించుచున్నవి. కొరింధులోని సంఘములో చీలికలు రాగా పౌలు దాన్ని ఖండించాడు. క్రైస్తవుల మధ్య చీలికలుండరాదని, వారందరు ఏకభావముతో మాటలాడవలెనని, ఏకమనస్సుతోను ఏక తాత్పర్యము

తోను మెలగాలని పౌలు వారికి బోధించాడు (1 కొరింథీ 1:10). నేనే దైనా సంఘసభ్యుడను కాగోరితే క్రీస్తునందు ఏకమైయున్న సంఘ సభ్యుడను కాగోరుదును. అట్టిదిగాక మిగతా సంఘాలన్నీ మానవ కల్పితాలే. అవి చీలికలు సృష్టిస్తాయి గనుక అవి ప్రభువుకు ఆయన మార్గానికి వ్యతిరేకులు.

అయిదోది. క్రీస్తుకు చెందే సంఘము, మనకు బైబిలులో కన బడే సంఘము, ఆయన నామాన్ని ధరిస్తాది. క్రీస్తు తన సంఘాన్ని కట్టుదునని వాగ్దానం చేసాడు గనుక అది ఆయనకే చెందుతాది. ఇది నిజం గనుక అది క్రీస్తు సంఘము. రోమాలోయున్న సంఘానికి వంద నములు పంపేటప్పుడు క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవని పౌలు చెప్పాడు. ఒక ప్రాంతములో యున్న స్థానిక సంఘాలను గూర్చి అతడట్లు చెప్పాడు. గాని దేవుని కుటుంబమంతా కలసి క్రీస్తుసంఘ మనబడింది. మరల సంఘమే దేవుని రాజ్యమని చెప్పబడింది (కొలస్స 1:13). సంఘమే రాజ్యమయితే ఆ రాజ్యము క్రీస్తుదయితే అది క్రీస్తు సంఘమని మనం గ్రహించాలి. క్రీస్తునామ మున నే రక్షణ యున్నది గాని వేరే నామంలో కాదు (అపొ. కా. 4:12). అందువలన క్రీస్తు సంఘసభ్యులు ఆయనను బట్టియే క్రైస్తవు లని పిలువబడుదురు (అపొ. కా. 11:26; 1 పేతురు 4:16). ఆవిధంగా వారు తమ రక్షకుడైన క్రీస్తును మహిమపరతురు. మానవకల్పిత నామములను ధరించుటద్వారా ఒకడు క్రీస్తును ఎట్లు మహిమ పరచ గలడు? నేను క్రీస్తును వెంబడింప గోరిన యెడల ఆయన నామమును ధరింప గోరుదును.

నేనేల క్రీస్తు సంఘసభ్యుడనయ్యానో ఇంకా అనేక కారణము లున్నవి గాని యివి ముఖ్యమైనవి. నీ సంగతి యేమిటి? నీవు క్రీస్తు సంఘసభ్యుడవు కానియెడల నీవు తప్పక కావాలని నిన్ను ప్రోత్సహించు

చున్నాను. క్రీస్తునందు విశ్వసించి, పాపముల విషయమై మారు మనస్సు పొంది, క్రీస్తే దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుటద్వారా నీవు క్రీస్తు సంఘ సభ్యుడవు కాగలవు (రోమా 10:10; లూకా 13:3; మత్త .0:32; అపొ. కా. 2:38). నీవట్లు చేయగా ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చును. నీవొక సంఘసభ్యుడవు కాగోరుచున్న యెడల నీవు క్రీస్తు సంఘసభ్యుడవు కావలెనని నిన్ను హెచ్చరించు చున్నాను.

---

## క్రీస్తు పునరుత్థానము - 3

### శిష్యులు శరీరమును ఎత్తికొని పోయిరా ?

గత రెండు సంచికలలో మనము యేసుక్రీస్తుయొక్క పునరుత్థానమును పరిశోధించుచుంటిమి. సమాధిలో యుంచబడిన క్రీస్తు శరీరమును ఆయన శత్రువు లెవరు ఎత్తికొనిపోయి యుండలేదని గత మన పరిశోధనవలన నిర్ధారణ అయినది. అయితే యేసు శిష్యులు ఆయన శరీరమును ఎత్తుకొని పోయిరా? అనే ప్రశ్నను ఈరోజు మనము పరిశోధింతము.

క్రీస్తు శిష్యులు ఆయన శరీరమును ఎత్తికొని పోయిరా? చరిత్రలో మనకున్న ఋజువులను బట్టి అట్టిపని జరుగుట అసాధ్యమని మన మెరుగుదుము. ఆయన శిష్యులే ఆయన శరీరమును ఎత్తికొని పోయిరని శత్రువులు మాత్రము చెప్పారు. గాని శిష్యులయితే దేవుని శక్తివలన క్రీస్తు మృతులలోనుండి సజీవుడై లేచెనని సాక్ష్యమిచ్చారు. వీరిద్దరి మాటలు ఒకదాని కొకటి వ్యతిరేకముగా యున్నవి. గనుక వీరిలో ఎవరిదో ఒకరిది అబద్ధ సాక్ష్యమై యుండాలి.

క్రీస్తు శరీరమును సమాధిలోనుండి దొంగిలించుటకు ఆయన

శిష్యులకు ఏవిధమైన ఉద్దేశము లేదు. నేను చనిపోయినను తిరిగి లేతు నని ఆయన తన శిష్యులకు అనేక మారులు చెప్పినను వారు నమ్మలేక పోయిరి. ఆయన రాజ్యము భూసంబంధమైన దనియు, దానిపై దృగ్గోచరముగ ఆయన అధిపతివలె యుండుననియు వారనుకొనిరి. యూదులు యేసును పట్టుకొని, బంధించి, ఆయనపై తీర్పు తీర్చుటకు ఏర్పరచగా వారి ఆశలన్నియును వారిలోనే అణగారిపోయాయి. అందువలన వారు ఒకరి వెనుక మరియొకరు ఆయనను వదలి వెళ్ళిపోయిరి. మిగిలిన కొద్ది మంది ఆయన సిలువ వేయబడుట, సమాధి చేయబడుట చూచి నిరాశ జీవులై కాపరిలేని గొర్రెలవలె చెదరిపోయిరి. మూడు దినముల తరువాత క్రీస్తు సమాధినుండి లేచియున్నాడను సంతోష వర్తమానమును కొందరు స్త్రీలు వారికి తెలియజేయగా వారా స్త్రీలను నమ్మలేక పోయిరి; సరిగదా యేసే వారికి అనేకమారులు కన్పడి వారితో అన్న పానములు పుచ్చుకొనువరకు ఆయన నిజముగ మృతులలో నుండి లేచాడని వారు సంపూర్తిగ నమ్మలేకపోయిరి.

శిష్యులు నిజముగా పునరుత్థానుడైన యేసును చూడలేదుగాని, పునరుత్థానుడైనట్లు వారు దర్శనములను చూచిరి యని కొందరు వాదింతురు. అపొస్తలులలో ఎవడును క్రీస్తు లేచునని నమ్మలేదు, అట్లు ఊహించలేదు. ఎవరైనను అనాభావ సంగతులను దర్శనములుగా చూచుట అసాధ్యము. అంతేకాదు 12 మంది అపొస్తలులు ఒకే దర్శనమును ఒకేమారు కనుగొనుట మహా ఆశ్చర్యము!

## సత్యం కొరకు శిష్యుల త్యాగము

క్రీస్తు పునరుత్థానుడు కానియెడల అదే సత్యమని శిష్యులు బోధించుటలో వారికి కలిగే ప్రయోజన మేమియును లేదు. యేసును దేవుడు లేపెను. దీనికి మేమందరము సాక్షులమని బోధించుటకు ఆయన శిష్యులు తమతమ ఉద్యోగములను విడచి, ఆకలి దప్పికలను,

శ్రమలను, చివరకు మరణమునుకూడ సహించినట్లు మనకు బాగుగా తెలియును. పునరుత్థానమును గూర్చి బోధించుచున్నందున వారు హింసింపబడి, హేళనచేయబడి, చివరకు చంపబడినందున పేరుప్రఖ్యాతులను సంపాదించుకొనుటకు వారట్లు చేసి యుండలేదు. ఒక అసత్యమును బోధించుచు దాని కొరకే తమ ప్రాణముల నర్పించుట మానవ నైజము కాదు. ఇక్కడ కనీసము 12 మంది అపొస్తలులు తమ సాక్ష్యమును మల్లించుటకంటె, హింసలను, కష్టములను, మరణమును భరించి దానియందే దృఢముగ నిలిచియుండి క్రీస్తు మృతులలో నుండి లేచెనని చెప్పుచున్నారే! ఒక అసత్యముకొరకు తమ ప్రాణములను పోగొట్టుకొనిన 12 మందిని మనము ఎన్నడయినను కనుగొన గలమా?

## కావలి వారి కల్పనలు

క్రీస్తు శిష్యులు ఆయన శరీరమును దొంగిలించిరని చెప్పినప్పుడు అట్టి అవకాశమును వారు ఎట్లు సంపాదించిరో మనము చెప్పలేము. క్రీస్తు సమాధి రోమా ప్రభుత్వ సిపాయిలచే కావలి యుంచబడినదని మన మందరము ఎరిగినదే! ఎంతమంది సమాధిదగ్గర కావలి యుండిరో మనకు తెలియదు. వారు 15 నుండి 40 మంది అయ్యుండ వచ్చును. అంతేకాదు, ప్రతి ఆరు గంటలకు వారు మార్చబడేవారు. క్రీస్తు తిరిగి లేచిన తరువాత కావలివారిలో కొందరు ఆ పట్టణమునకు వచ్చి జరిగిన సంగతులను అన్నిటిని ప్రధాన యాజకులతో చెప్పిరి. వారు కావలి వారికి చాల ద్రవ్యమిచ్చి - మేము నిద్రపోవుచుండగా అతని శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తికొని పోయిరని మీరు చెప్పుడని వారిని ప్రోత్సహించిరి.

కావలివారు సమాధియొద్ద ఒకే ఒక్క పనికొరకు అంటే సమాధిని కావలి యుంచుటకే ఉంచబడిరి యని మనము గ్రహింపవలెను. ఈ కావలివారు ఇప్పుడు, మేము నిద్రపోవుచుండగా శిష్యులు రాత్రి

వేళ వచ్చి యేసును ఎత్తికొని పోయిరని చెప్పుచున్నారు. సమాధి దగ్గర కావలియున్న వారందరు ఒకే సమయమున నిద్రించుట అసంభవము, సరిగదా డ్యూటీలో నిద్రపోయే సైనికుడు మరణ శిక్షకు పాత్రుడు. అయితే కావలివారిలో ఎవడును అందు విషయమై మరణ శిక్ష ననుభవించినట్లు చరిత్ర మనకు చెప్పుటలేదు.

శిష్యులు శరీరమును ఎత్తికొనిపోయిరని చెప్పు కథనము సిపాయిలలో గాక ప్రధాన యాజకులలో ఉద్భవించెను. ఆ కథను చెప్పుటకు వారు సిపాయిలకు లంచమిచ్చిరి. నిజాన్ని చెప్పుటకు ఎవనికీ లంచమవసరములేదని మనము ఇట్టే గ్రహించగలము. అంతేకాదు, ఇప్పుడు మనము గమనించవలసిన ఇంకో సంగతి యున్నది - ఒకడు నిద్రించుచుండగా ఏమి జరిగినదో దానిపై సాక్ష్యమిచ్చువాని సాక్ష్యమును ఏ న్యాయస్థానము కూడ అంగీకరించదు. అందువలన మేము నిద్రించుచుండగా శిష్యులు క్రీస్తు శరీరమును దొంగిలించిరి యని చెప్పు కావలివారి సాక్ష్యమును మన మెట్లు అంగీకరించగలము? వారొకవేళ నిద్రించుచున్న యెడల దొంగిలించినవారు శిష్యులని వారెట్లు ఎరుగుదురు? ఒకవేళ వారు మెలకువగా యున్న యెడల శరీరమును దొంగిలించకుండగ శిష్యులను వారు ఎందుకు ఆపుచేయలేదు?

శిష్యులు క్రీస్తు శరీరమును ఎత్తికొని పోయినట్లు యూదులందరును నిజముగా నమ్మిరని మన మనుకొనిన యెడల, వారు శిష్యులను బంధించ వలసినదని అధికారులను అడిగి యుండవలసినదే? లేదా దొంగిలించిన శరీరమును తిరిగి అప్పగించవలెనని వారిని హెచ్చరించి యుండవలసినదే? గాని అట్టి దేమియును జరుగనేలేదు? అయితే ఎందుకు జరుగలేదు? క్రీస్తు శరీరమును దొంగిలించిన కారణముగ శిష్యులెవరును బంధింపబడలేదు గనుక వారిపై మోపిన నేరమును యూదులే నమ్మలేదని మనకు నిర్ధారణ యగుచున్నది.

# శిష్యుల ధైర్యం

క్రీస్తు శిష్యులు పునరుత్థానమును గూర్చి ప్రకటించుటలో ఏ విధమైన పిరికితనమును వ్యక్తపరచక ధైర్యముగ బోధించుచుండిరి. క్రీస్తు చనిపోకముందు బహు పిరికివానివలె ప్రవర్తించిన అపొస్తలుడైన పేతురు పునరుత్థానుడైన క్రీస్తును గూర్చి యోహానుతో కూడ, యెరూషలేములో సొలొమోనుదను మంటపముయొద్ద గుంపుగా పరుగెత్తుకొని వచ్చిన ప్రజలకు ఇట్లు ధైర్యముగ బోధించెను- "ఇశ్రాయేలీయులారా, మీరు దీని విషయమై ఎందుకు ఆశ్చర్యపడుచున్నారు ?- అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు అనువారి దేవుడు, అనగా మన పితరుల దేవుడు తన సేవకుడైన యేసును మహిమ పరచి యున్నాడు; మీరాయనను అప్పగించితిరి. పిలాతు ఆయనను విడుదల చేయుటకు నిశ్చయించినపుడు మీరు అతని యెదుట ఆయనను నిరాకరించిరి. మీరు పరిశుద్ధుడును, నీతిమంతుడునైన వానిని నిరాకరించి, నరహంతకుడైన మనుష్యుని మీకు అనుగ్రహింపుమని అడిగితిరి. మీరు జీవాధిపతిని చంపితిరిగాని దేవుడు ఆయనను మృతులలోనుండి లేపెను; అందుకు మేము సాక్షులము — సహోదరులారా, మీరును మీ అధికారులును తెలియక చేసితిరని నాకు తెలియును. అయితే దేవుడు తన క్రీస్తు శ్రమపడునని సమస్త ప్రవక్తలనోట ముందుగా ప్రచురపరచిన విషయములను ఈలాగున నెరవేర్చెను. ప్రభువు సముఖము నుండి విశ్రాంతి కాలములు వచ్చునట్లును, మీకొరకు నియమించిన క్రీస్తును ఆయన పంపునట్లును, మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొ. కా. 3:11–20). మరునాడు అధికారులు, పెద్దలు, శాస్త్రులు, ప్రధాన యాజకులు మొదలగు వారందరి యెదుట పేతురు నిర్భయముగ ఇట్లు ప్రకటించెను : "ప్రజల అధికారులారా, పెద్దలారా, మీ రందరును, ఇశ్రాయేలు ప్రజలందరును తెలిసికొనవలసిన దేమనగా మీరు సిలువ వేసినట్టియు, మృతు

లలో నుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసు నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ.కా. 4:12). "అయినను ఇది ప్రజలలో ఇంక వ్యాపింప కుండుటకై ఇక మీదట ఈ నామమును బట్టి ఏ మనుష్యులతో నైనను మాటలాడ కూడదని మనము వారిని బెదరు పెట్టవలెనని చెప్పుకొనిరి. అప్పుడు వారిని పిలిపించి మీరు యేసు నామమును బట్టి ఎంత మాత్రమును మాటలాడ కూడదు, బాధింపకూడదని వారి కాజ్ఞాపించిరి. అందుకు పేతురును, యోహానును వారిని చూచి దేవుని మాట వినుటకంటె మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పుడి? మేము విన్న వాటిని, కన్నవాటిని చెప్పక యుండలేమని వారికి ఉత్తర మిచ్చిరి" (అపొ. కా. 3:17-20). అపొస్తలులు యిచ్చుచున్న సాక్ష్యమునుబట్టి వారు పునరుత్థానమును గూర్చి అబద్ధ మాడుటలేదు గాని వారి దృఢ విశ్వాసమును అతి ఖచ్చితముగ నిర్భయముగ ప్రకటించు చుండిరి.

క్రీస్తు శరీరమును శిష్యులు సమాధి నుండి ఎత్తుకొనిపోయిరా? క్రీస్తు శిష్యులు ఆయన తిరిగి లేచునని విశ్వాస ముంచనందు వలన, ఆయన దేహమును దొంగిలించు అభిప్రాయము వారికి లేనందునను, సమాధిచుట్టు కావలి వా రుండుటచేతను, శిష్యు లెవరు బంధింపబడక పోవుటచేతను, శిష్యులెవరు క్రీస్తు శరీరమును సమాధినుండి దొంగిలించి యుండలేదని తప్పక నిరూపణ యగుచున్నది. గనుక మనము గ్రహింపవలసినది ఒకే ఒక్కటె యున్నది. క్రీస్తు మృతులలో నుండి లేచెను!! దీనికింక తిరుగులేదు అది ఒక గొప్ప వాస్తవము. వచ్చే సంచికలో ఈ గొప్ప సత్యమును మరింత సుదీర్ఘముగ తెలిసికొందము.

మృతులలో నుండి తిరిగి లేచిన యేసునందు మీరు విశ్వాస ముంచుడి. మీ విశ్వాసమునకు విధేయతను జోడించుడి. అట్లుచేసి

పునరుత్థానుడైన క్రీస్తు యొక్క సువార్తను మీరును చాటించుడి. అప్పుడు మీరు ఇహలోకమందును, పరలోకమందును తప్పక దీవించ బడుదురు.

—జాషువా గూటం.

---

## సిద్ధాంతము ముఖ్యమా?

## *( Is the Dotrine Important? )*

ఒకాయనతో నేను చర్చించినప్పుడు, క్రీస్తు ముఖ్యముగాని, సిద్ధాంతము ముఖ్యముకాదు అని చెప్పాడు. నేడు అనేకమంది దీనిని విశ్వసించుచున్నారు. ఉదాహరణకు: సంఘము, ఐక్యత, రక్షణ, మార్గము, బాప్తిస్మము, ఆరాధన మొదలగు అంశములపై వాక్యప్రకారము మనము చేయు బోధనలను మానవ మతశాఖలవారు వ్యతిరేకించుదురు. ఇవన్నియు సిద్ధాంతమునకు సంబంధించిన విషయములు గాబట్టి మనము వాటిని బోధించినయెడల ప్రజలు కళ్ళు తెరచి, ప్రశ్నలు వేసి సత్యవాక్యమును సరిగా తెలుసుకొనివారికి దూరమై పోవుదురను భయ సందేహములు మతశాఖలవారికి వున్నందున, వారు మాకు క్రీస్తు ముఖ్యముగాని, క్రీస్తు బోధనలు ముఖ్యంకాదు అని వాదించుదురు. మరికొందరు మేము మొదటినుండి పలానా శాఖలో వున్నాము గాబట్టి పారంపర్యాచారముగా ఆ పద్ధతులనే అనుసరించు చున్నాము అను దానిని సమర్థించుకొనుటకును, వారిపై ప్రజలకు ఏవిధమైన ద్వేషభావము లేకుండుటకును, క్రీస్తు మా స్వరక్షకుడుగాని సిద్ధాంతము మాకు ముఖ్యముగాదు అని వాదించుదురు. కాని బైబిలు మానవులు కల్పించిన పారంపర్యాచార పద్ధతులను ఖండించుచున్నది. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15 : 9). "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు

ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండు వాడు తండ్రిని, కుమారుని అంగీకరించువాడు. ఎవడైనను ఈ బోధను తేక మీయొద్దకు వచ్చినయెడల వానిని మీయింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పువాడు వాని దుష్టక్రియలలో పాలివాడగును" (2 యోహాను 1:9-11). దీనినిబట్టి క్రైస్తవులు "క్రీస్తు బోధయందు" నిలిచి యుండవలెనని తేటగా అర్థమగుచున్నది. అట్లైన క్రీస్తు బోధన లేమని మీరు ప్రశ్నింపవచ్చును. మంచిది.

## క్రీస్తు బోధ

ప్రభువైన క్రీస్తు వచ్చిన క్రొత్త నిబంధనలో వ్రాయబడి యున్నదంతయు క్రీస్తు సిద్ధాంతమే. "పూర్వకాలమందు నానాసమయములలోను నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈదినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయనద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:1-2). కాబట్టి దేవుడు క్రీస్తుద్వారాను, క్రీస్తు తన క్రొత్త నిబంధన వాక్యముద్వారాను నేడు మనతో మాటలాడుచున్నాడు. క్రొత్త నిబంధనలో క్రీస్తు స్వయంగా పలికినవి మాత్రమేకాక, అపొస్తలుల బోధలు; క్రొత్త నిబంధనంతయుకూడా క్రీస్తు, లేక దేవుడు యిచ్చిన బోధ యని గమనించతగును. క్రీస్తు, దేవునిని గూర్చి ప్రకటించిన విధమున, శిష్యులు క్రీస్తును గూర్చి ప్రకటించిరి (మత్తయి 28:20; లూకా 24:47-49; యోహాను 14:16; 16:13; అపొ. కా. 1:1-8). ఒక లేఖనము మాత్రమేకాక ప్రతిలేఖనము దైవావేశము వలన కలిగినదని పౌలు తిమోతికి వ్రాసెను (II తిమోతి 3:17). కార్యములు 2వ అధ్యాయమును అపొస్తలుల మనము చదివిన యెడల మూడువేలమంది యూదులు సువార్తను విని, మారుమనస్సు పొంది,

పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును బాప్తిస్మము పొందినప్పుడు బైబిలు రికార్డు ఈవిధముగా ఉన్నది. "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అపొ. కా. 2:42). నిజానికి ఆదిసంఘము మొదలుకొని, ఏబోధనైతే దేవుడు క్రీస్తు ద్వారా యిచ్చినాడో, అదే బోధను లేక సువార్తను అపొస్తలులుకూడా బోధించుచు, ఐక్యముగా యుంటూ ఒకేనామమున పిలువబడుచు ఒకే సువార్తకు లోబడి యుండిరి. కాని నేడు కేథలిక్‌లు, ప్రొటెస్టాంటులు, నానావిధములైన మతశాఖలుగా విభాగింపబడి యుండుటకు గల ముఖ్య కారణము క్రొత్త నిబంధన వాక్యమునకు లోబడక, మానవులు తమతమ కల్పిత పద్ధతులను అనుసరించుటయే. పౌలు తిమోతికి వ్రాసిన విధమును పరిశీలింతము. "వాక్యమును పరిశీలింతము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణ దీర్ఘశాంతముతో" ఉపదేశించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురద చెవులుగలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసికొని, సత్యమునకు చెవియియ్యక కల్పనాకథలవైపుకు తిరుగు కాలము వచ్చును" (2 తిమోతి 4:2-3). పౌలు గలతి సంఘమునకు వ్రాయుచు "మేము మీకు ప్రకటించిన సువార్తనుగాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక" (గం తీ 1:8, 9).

కాబట్టి క్రీస్తు బోధను విడనాడి, మనుష్యులు కల్పించిన పారంపర్యాచార పద్ధతులను అనుసరించిన యెడల, మనము దేవుని ఆయన కుమారుడైన యేసుక్రీస్తును లేనివారమగుదుము. అలా కాక మనము క్రీస్తు బోధలను అనుసరించిన యెడల అబద్ధప్రచారకుల యొక్క దుష్ట

క్రియలయందు పాలివారము కాకుండునట్లు మనలను మనము సరిదిద్దు కొనగలము. ఇతరులనుగూడా సరిదిద్దగలము.

మూలం సన్నీ డేవిడ్;
అనువాదం: కె. రవీంద్రబాబు, న్యూఢిల్లీ.

---

# మనము ఇరవై మందిని కనుగొనగలమా?

## *(Can we find Twenty Men?)*

—జె. సి. బెయిలీ

దృఢసంకల్పము, దృఢవిశ్వాసము గలిగిన ఇరవై మంది పురుషులను మనం కనుగొనగలిగితే రాబోయే 20 సంవత్సరాల్లో భారత దేశానికంతటికి సువార్త ప్రకటించగలమని నేను పలుమారులు చెప్పాను. వారిని మనం కనుగొనగలమా! యిర్మియా కాలంలో వారొక మనుష్యుని కొరకు గాలించారు గాని కనుగొనలేకపోయారు (యిర్మియా 5:1). కొన్ని సంవత్సరాల తరువాత ఒకడైనను దొరుకునేమో యని వారు వెదకిరి గాని కనుగొనలేకపోయారు (యెహెజ్కే 22 : 30).

మేము ఎటువంటి మనుష్యులకొరకు వెదకుచున్నాము? ఈ లోకాన్నంతటిని మార్చుటకు ఒక పరిపూర్ణ సంకల్పాన్ని దేవుడు క్రొత్త నిబంధనలో నెలకొల్పాడని నమ్ము వానికొరకు మేము వెదకుచున్నాము. పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధయందు విశ్వాసము గలవారి కొరకు మేము వెదకుచున్నాము (యూదా : 3). దేవుని వాక్యమునందు మనం నిలిచియుండాలని విశ్వసించువారి కొరకు మేము వెదకుచున్నాము (యోహాను 8:31, 32). మనం క్రీస్తు బోధ యందు నిలిచి యుండాలి (2 యోహాను : 9). మనం అనుసరించ గలిగినది దేవుని మార్గమొక్కటి మాత్రమే నని విశ్వసించువారికొరకు

మేము వెదకుచున్నాము (యెషయా 55:8, 9). పెంతెకొస్తునాడు సంఘము స్థాపించబడినదని నమ్మువారు మాకు కావాలి. మానవు లందరు సంఘములో సమానులే యని నమ్మువారు మాకు కావాలి (యెషయా 2:2; ఎఫెసీ 3:21).

ప్రభువైన యేసుక్రీస్తుకు విధేయులగుటయే మానవులందరి విధి (హెబ్రీ 5:9). ప్రాథమికంగా ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానుడైన లోక రక్షకుడని నమ్మాలి. మనం పాపముల విషయమై మారు మనస్సు పొందాలి, మన జీవితాలను ప్రభువైన యేసుక్రీస్తుకు సమర్పణ చేయాలి, ఆ విశ్వాసాన్ని మనం మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి, అప్పుడు పాపక్షమాపణ నిమిత్తము తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి బాప్తిస్మము పొందాలి (మత్తయి 10:32; 28:19; అపొ.కా. 2:38). మనం క్రీస్తులోనికి బాప్తిస్మము పొందాము (గలతీ 3:27). ఒకేఒక్క శరీరమైన సంఘములోనికి మనం బాప్తిస్మము పొందాము (1 కొరింథీ 12:13). క్రీస్తుకు ఆయన సంఘానికి యున్న మన సంబంధం ఇప్పుడు ఒక్కటే.

బాప్తిస్మము పొందినవారు బోధింపబడాలి. ప్రభువు ఏయే సంగతుల నాజ్ఞాపించెనో వాటన్నిటిని వారు గైకొనునట్లు బోధింపబడాలి (మత్తయి 28:20). బాప్తిస్మము పొందిన ప్రతి విశ్వాసి క్రీస్తు ద్వారా దేవుని ఆరాధింప బాధ్యుడు. దేవుని మనం క్రీస్తుద్వారానే సేవించాలి గాని వేరొక మానవుడు లేక మానవులద్వారా కాదు. క్రొత్త నిబంధనలోని సంఘానికి మానవులు కల్పించిన మిషనులకు ఇక్కడే విభాగించే గీత ఏర్పడును. మిషనులు మానవ కల్పితాలు. సంఘం క్రీస్తుచే నడిపింపబడును. డినామినేషన్లు మానవులచే కల్పించబడ్డాయి. అవి మానవులచే పాలించబడతాయి గాని క్రీస్తు తన సంఘానికి శిరస్సైయున్నాడు (ఎఫెసీ 5:23).

## దేవుని యెదుట అందరు సమానులే

క్రొత్తగా మార్పుజెందిన వారికి దేవుని యెడల తమ విధిని గూర్చి బోధించడానికి అపొస్తలులు జాగ్రత్త వహించారు (అపొ.కా. 6:2-4). దేవుడు తన మార్గాన్ని ప్రజలందరికీ ఉద్దేశించాడు. సువార్త యొక్క సార్వజనిక పిలుపును ఎదురాడిన వారు క్రొత్త నిబంధన కాలంలోకూడా లేకపోలేదు. ప్రజలు సున్నతిపొంది మోషే ధర్మ శాస్త్రాన్ని అనుసరించాలని వారు చెప్పారు (అపొ.కా. 15:1). దేవుని యెదుట మానవులలో వ్యత్యాసంలేదని పరిశుద్ధాత్ముడు జవాబిచ్చాడు. యూదులేమి అన్యజనులేమి, భారతీయులేమి అమెరికావారేమి దేవుని యెదుట అందరు సమానులే. విశ్వాసమువలన దేవుడు హృదయమును పవిత్రపరచును (అపొ.కా. 15:9). సర్వజనాంగముల హృదయాన్ని పవిత్రపరిచే విశ్వాసము విధేయత గలిగిన విశ్వాసము. ఇప్పుడు కొన్ని లేఖనములను చూద్దాం. "ఈయన నామము నిమిత్తము సమస్తజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు ఈయనద్వారా మేము కృపను అపొస్తల తత్వమును పొందితిమి" (రోమా 1:7). రోమాపత్రిక మొదటి అధ్యాయంలో చెప్పబడినదాన్ని వక్కాణించుటకు పరిశుద్ధాత్ముడు ఆఖరి అధ్యాయంలో ఇట్లనుచున్నాడు: "సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు ... నిత్య దేవుని ఆజ్ఞప్రకారము ప్రవక్తల లేఖనములద్వారా వారికి తెలుపబడి యున్నది" (రోమా 16:25). గనుక సమస్త జనాంగములు విశ్వాసమునకు విధేయులు కావలసి యున్నది. మేము వెదకుచున్నవారి ప్రాముఖ్యమైన అర్హత ఇక్కడ యున్నది.

### బోధించే బాధ్యత

మానవులు ప్రభువైన యేసుక్రీస్తుకు విధేయులు కావాలని నీవు బోధింతువా? బాప్తిస్మము పొందిన విశ్వాసులు ప్రభువైన యేసుక్రీస్తు సంఘసభ్యులని నీవు బోధింతువా? ఆరాధించే బాధ్యత వారిదేయని,

సంఘకృషి వారిదేయని, ప్రతిసభ్యుని బలముపైననే సంఘకృషి యొక్క విజయం ఆధారపడి యున్నదని నీవు బోధింతువా? (ఎఫెసీ 4:14-16).

అపొస్తలులవలన బోధింపబడిన ఆదిమసంఘము హింసలురాగా చెల్లాచెదరై పోయినను వారు సువార్త వాక్యము ప్రకటించుచు సంచారము చేసారు (అపొ. కా. 8:4). ఒక సువార్తికుడు సమరయకు వెళ్లాడు. అతడు వాక్యాన్ని బోధించాడు. ఈ కాందిసీకులలో కొందరు అంతియొకయకు వెళ్లారు, వాక్యాన్ని బోధించారు. తత్ఫలితంగా క్రొత్త నిబంధనలో ఒక గొప్పసంఘం అక్కడ ఏర్పడింది (అపొ. కా. 11 : 19-26).

## నీ సహవాసం దేనిపై ఆధారపడి యున్నది?

అబద్ధ సిద్ధాంతములు ప్రబలి యున్నంతకాలం మనకు శ్రమ యున్నది. మనం పొందవలసినంత విజయాన్ని పొందలేము. హిందూదేశ సోదరులలో కొందరు విజయం పొందాలంటే అమెరికా డబ్బు పొందాలని తలుస్తారు. లేఖనముల నుండి దాన్ని వారు పొందలేదు. ఈ అబద్ధ సిద్ధాంతాన్ని విశ్వసించని వారి కొరకు మేము వెదకుచున్నాము. సత్యాన్ని అసత్యంతో మనం మిళితం చేయలేము. అమెరికానుండి మనకు సహాయంవస్తే మంచిదేగాని దానిపైనే మన పనిని ఆధారం చేయరాదు. అమెరికా డబ్బు సంపాదించే స్తోమతను బట్టి మనం మనుష్యులను ఎంచరాదు. విధేయతగల విశ్వాసాన్ని బట్టియే గాని మరి దేనినిబట్టి మానవులను మనం ఎంచరాదు. మనం వెలుగులో నడుచుచున్నామో లేదో యను దానినిబట్టి మన సహవాసము ఆధారపడి యుండాలి (1 యోహాను 1:7).

మీకొక ఉదాహరణ ఇయ్యగోర్తాను. అన్నదమ్ములలో ఒక సహోదరుడు నాతో పనిచేసాడు. అతడు నిజంగా కష్టించి పనిచేసే

వాడు. నాతో పనిచేసినంతకాలము అతనికి అమెరికా ఆర్థిక సహాయం ఏమీ అందలేదు. అయితే ఈమధ్య అతడు నాకో ఉత్తరాన్ని వ్రాసాడు. మా యిద్దరి సహవాసం కొనసాగాలంటే ఇప్పుడు అతనికి అమెరికా నుండి ఆర్థిక సహాయం లభించేటట్లు నేను చూడాలని అతడు చెప్పాడు. ఎంత విచారమో! అతడు మంచి పనివాడేమోగాని అమెరికా డబ్బుపై అతని సహవాసాన్ని మాత్రం ఆధారపరచాడు. మనం యేసుతో సహవాసం కలిగి యుండగలమా? "అంతట ఒక శాస్త్రి వచ్చి బోధకుడా నీవెక్కడికి వెళ్ళినను నీవెంట వచ్చెదనని ఆయనతో చెప్పెను. అందుకు యేసు నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవుగాని మనుష్య కుమారునికి తల వాల్చుకొనుటకైనను స్థలము లేదని అతనితో చెప్పెను" (మత్త 8:19, 20). మరల యేసు మాటలను విందము: "అప్పుడు యేసు తన శిష్యులను చూచి ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తికొని నన్ను వెంబడింప వలెనను" (మత్త 16:24).

మేము వెదకుచున్నవారు ఫిలిప్పీ 4:13, 19 లో వ్రాయబడిన వాగ్దానములను విశ్వసించాలి. ప్రభువైన యేసుక్రీస్తుకు విధేయులయ్యేవారు భారతదేశంలో లక్షలాది ప్రజలున్నారు. యేసు ప్రభువుకు విధేయులవ్వాలని వారికి బోధింపబడాలి. వారు సభ్యులైన మొదటి దినంనుండి సంఘ పనిని వారు జరిగించుట బోధింపబడాలి. విశ్వాస విధేయతలతో మనం మనపని నిర్వర్తిస్తే ప్రభువు తన పనిని నిర్వర్తిస్తాడు.

విశ్వాసమువలన ఆయన కృపలోనికి మనకు ప్రవేశ మున్నది (రోమా 5:2). ఎన్ని కష్టములు వచ్చినను దేవుని కృపవలన అపొస్తలు లందరికంటె నేనెక్కువ ప్రయాస పడితినని అపొ. పౌలు చెప్పాడు (1 కొరింథీ 15:10). సువార్తను బోధించుటకు మనం ఋణస్థులము (రోమా 1:14). దేవుడు తన స్వరక్త మిచ్చి మనలను కొన్నాడు (అపొ. కా. 20:28).

అమెరికాలోని సంఘానికి ఇండియాలోని సంఘానికి గల సంబంధాన్ని గూర్చిన అసత్య భావాలను ప్రక్కకు నెట్టివేయుటకు నీవు సంసిద్ధుడవా? నేను ప్రభువు యొక్క ఆజ్ఞలను, వాగ్దానములను హృదయపూర్వకంగా, నిస్సందేహంగా విశ్వసించుచున్నానని చెప్పుటకు నీవు సంసిద్ధుడవా? నిజంగా క్రొత్త నిబంధన మాదిరి చొప్పున నీవు స్థానిక సంఘాలను స్థాపించెదవా?

---

## పూర్ణమైనది....పూర్ణము కానిది
## *(Part and Perfect)*

"ప్రేమ శాశ్వతకాల ముండును. ప్రవచనములైనను నిరర్థకములగును. భాషలైనను నిలిచిపోవును; జ్ఞానమైనను నిరర్థకమగును. మనము కొంతమట్టుకు ఎరుగుదుము. కొంతమట్టుకు ప్రవచించుచున్నాము గాని పూర్ణమైనది వచ్చినపుడు పూర్ణము కానిది నిరర్థకమగును" (1 కొరింధి 13 : 8-10).

అపో. పౌలు కొరింధు సంఘమునకు ఈ పత్రిక వ్రాయు కాలమునాటికి వారికున్న జ్ఞానము, భాషలు, ప్రవచనములు పూర్ణము కానివని కొంతమట్టుకు మాత్రమే ఎరుగబడిన అనుభవముగలవై అప్పటి తరువాత పూర్ణమైనది వచ్చుటచే పూర్ణముకాని జ్ఞానము, భాషలు, ప్రవచనము మొదలైన అనుభవములు ఆగిపోవునని తెలియుచున్నది.

పూర్ణమైనది అనగా అది ప్రభువైన యేసుక్రీస్తుయొక్క రెండవ రాకడ సమయమే యని కొందరు అబద్ధ బోధకులు బోధింతురు. అయితే "పూర్ణమైనది అనగా ప్రభువైన యేసుక్రీస్తు రెండవరాకడ" యని ఏ పుస్తకము, ఏ అధ్యాయము, ఏ వచనమునందు కలదో నిరూపించగలరా? అట్టి నిర్వచనము బైబిలునందు లేనపుడు అది మనుష్యుల

కల్పనయేగదా ? (ఎఫె. 4:14). అట్టి మానవ కల్పితములవలన దేవుని చిత్తము నుల్లంఘించుచున్నారన్న సత్యమును ప్రభువు ఎంత తేటగా వెల్లడించిరోగదా ! (మార్కు 7:7-13). అది అట్లుండగా 1 కొరింధి 13:8-13 చదువుచున్నప్పుడు పూర్ణమైనది వచ్చినపుడు పూర్ణము కానివి ఆగిపోయిననూ మరికొన్ని నిలిచియే యుండునని తేటబడు చున్నది. అవి ఏవనగా :

"పూర్ణమైనది వచ్చినపుడు"

| ఆగిపోవునవి : | నిలిచియుండునవి : |
|---|---|
| 1. జ్ఞానము | 1. విశ్వాసము |
| 2. భాషలు | 2. నిరీక్షణ |
| 3. ప్రవచనములు | 3. ప్రేమ |

పూర్ణమైనది క్రీస్తు రెండవరాకడ యైనచో అపుడు విశ్వాసము, నిరీక్షణలయొక్క అవసరత ఏమున్నది? క్రీస్తు రెండవ రాకడలో ఆయనను ముఖాముఖిగా చూతుముగదా ? (1 పేతు 1:7; 1 యోహా 3:2). అట్టి అనుభవము నేటి విశ్వాస నిరీక్షణలయొక్క ఫలమై యుం డును. ఏలయనగా "విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజ స్వరూపమును అదృశ్యమైనవి ఉన్నవనుటకు రుజువునై యున్నది" (హెబ్రీ 11:1). పూర్ణమైనది వచ్చినతరువాత కూడా విశ్వాసము, నిరీక్షణ సంఘములో ఉండునని వ్రాయబడినందున క్రీస్తు రెండవ రాకడవరకు సంఘము విశ్వాసమందును, నిరీక్షణయందును నిలకడగా నుండవలెను. గనుక పూర్ణమైనది క్రీస్తు రెండవరాకడ సమయము కాదని రుజువగుచున్నది. "ప్రేమ" శాశ్వతకాలము ఉండును. అనగా పూర్ణమైనది రాకమునుపు, వచ్చినపిమ్మటకూడా ఉండును ( 1 కొరిం 13:8). అందుకనే విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ అను వాటిలో "శ్రేష్ఠ మైనది ప్రేమ" యని (1 కొరిం. 13:13) వ్రాయబడెను.

# పూర్ణమైనది ఏది?

అయితే పూర్ణమైనది ఏది? అది యెప్పుడు వచ్చును? అపొ. పౌలు కొరింథీయులకు ఆ పత్రిక వ్రాయుటకును, క్రీస్తు రెండవ రాకడ కును మధ్యలో పూర్ణమైనది వచ్చును అని తెలియుచున్నది. క్రీస్తు రెండవరాకడ ఇంకను జరుగలేదని ఎంత తేటగా మన మెరుగుదుమో అంత తేటగా పూర్ణమైనది వచ్చెననికూడా మన మెరుగుటకు లేఖ నము తోడ్పడుచున్నది.

క్రొత్త నిబంధన 27 పుస్తకములు కలిగియుండి అవన్నియు ఒకేసారి ఒకే ఒకనిచే వ్రాయబడక కొంత కొంతగా, ఒక్కొక్కరిచే కొన్ని సంవత్సరముల కాలములో పరిశుద్ధాత్మ ద్వారా వ్రాయబడెను. అట్లు వ్రాసినవారిలో అపొ. పౌలు ఒకడై యుండెను. అట్లు అందరితో బాటు తనకు కొంత బయలు పర్చబడినందుననే మనము కొంత మట్టుకు ఎరుగుదుము. కొంతమట్టుకు ప్రవచించుచున్నాము అని అనుచున్నాడు (1 కొరింథీ 13:9). దానినే పూర్ణము కానిదనికూడ అతడు వ్రాసాడు.

అప్పటిలో అనగా వారు సంఘముగా కూడినప్పుడు విశ్వాసు లైనవారికి అవసరమగు దేవోక్తులను ఉపదేశించుటకు వారిదగ్గర క్రొత్త నిబంధన లేఖనము (గ్రంథముగా) లేనందున వారిలో కొందరికి ఆత్మవరముల నిచ్చి అట్టి వరములవలన సంఘములను ఉజ్జీవింపజేయుచు స్థిరపరచుచుండెను (1 కొరింథీ 14:26, 33 చదవండి). అది పూర్ణము కాని కాలమునాటి క్రమము అయితే పూర్ణమైనది వచ్చినపుడు "ఇక" పూర్ణముకాని క్రమము నిలిచిపోయి పూర్ణమైన క్రమములో విశ్వా సమును, నిరీక్షణను, ప్రేమను అభివృద్ధి చేయుచుండును. అయితే ఇవుడు పూర్ణమైనది ఏది? లేఖన నిర్వచనమును చూతము. యాకోబు 1:25 వచనమునందు "సంపూర్ణ నియమములో తేరిచూచి...ఇదియే

పూర్ణమైనది" అని వ్రాయబడెను. పౌలువలన కొంత, యాకోబువలన కొంత, పేతురు, యోహానులు మొదలైనవారిద్వారా కొంతకొంతగా అనుగ్రహింపబడి A.D. 96 లో ప్రకటన గ్రంధము వ్రాసి పూర్తి కావడముతో క్రొత్త నిబంధన చట్టము "సంపూర్ణ నియమము"గా రూపొందెను. గాన మనము తేరిచూడవలసినది ఈ నియమమునే (2 తిమో 2:5). ఇపుడా నియమము పూర్ణమైనదిగా వెల్లడియై లేఖనముగా మన చేతిలోనికి వచ్చెను. ఇపుడు మనకు కావలసిన హెచ్చరికలు, ఉపదేశములు మొదలైన వన్నియూ లేఖనమునుండియే కలుగవలెను. లేఖనమువలననే దైవజనుడు ప్రతీ సత్కార్యమునకు సంపూర్ణముగా సిద్ధపడుచున్నాడు (2 తిమొ 3:16-17). నేడు అనగా A.D. 96 తరువాత జరగవలసిన సువార్త ప్రచారము వాక్యము ప్రకటించుట ద్వారా జరుగవలెను గాని ప్రవచనముద్వారా కాదు (2 తిమొ. 4:1; 2:15; ప్రకటన 22:18-19). అప్పటి ప్రవచనము లన్నియూ లేఖనములుగా నిరూపింపబడి (2 పేతు 1:21) అవి మనకొరకు భద్రపరచబడెను. (2 పేతు 1:13-15).

ఇపుడు మనము తెలిసికొనవలసి దేవుని చిత్తము, దర్శనములు లేక ప్రేరేపణలవలన కాదుగాని వ్రాయబడిన లేఖనములు చదువుకొనుటవలన మాత్రమే (ఎఫెసీ 3:3-4; 2 థెస్స 2:14-15). అప్పటిలో ఒకనికి జ్ఞానము కలుగవలెనంటే అది వరముగా అనుగ్రహింపబడి వాక్యము ప్రచురింపబడెను. (1 కొరిం. 12:8) ఇపుడైతే జ్ఞానము కలిగించుటకు శక్తిగల పరిశుద్ధ లేఖనము (2 తిమొ. 3:14-15) వలన జ్ఞానము పొందుచున్నాము. ఇట్లు సంపూర్ణమైయున్న దేవుని చిత్తము గ్రహించుచున్నాము (రోమా 12:2).

అయితే "పూర్ణమైనది" వచ్చిన పిమ్మటకూడ పూర్ణమైనది రాలేదని చెప్పుచూ పూర్ణము కాని భాషలు, ప్రవచనములు మొదలగునవి కలిగి యున్నామని చెప్పుకొనుచున్న వారిలో కనబడే భాషలు,

ప్రవచనముల సంగతి యేమిటి? ఇందుకు లేఖనమే ఆధారము. ఎట్లనగా సత్యస్వరూపియైన ఆత్మ ఉన్నట్లే (యోహాను 16:13), భ్రమపరచు ఆత్మకూడ ఉన్నాడు (1 యోహాను 4:6). సత్య స్వరూపియైన ఆత్మ వచ్చి సత్యమంతయూ బోధించి, వివిధవరములతో వారితో కూడా సాక్ష్య మిచ్చుచుండగా వినినవారివలన మనకు దృఢపర్చబడెను (హెబ్రీ 2:4). "భ్రమపర్చు ఆత్మ" వచ్చి భిన్నమైన బోధలతో అబద్ధ ప్రవచనములతో అనేకులను మోసపర్చు చున్నాడు (1 తిమోతి 4:1-2).

గాన ప్రియ చదువరీ! పరిశుద్ధాత్మవలన కలిగిన పరిశుద్ధ లేఖనములద్వారా వెల్లడియై సంపూర్ణమై యున్న సత్యమును వెంబడించుము. మానవ కల్పితములగు కట్టడలను విడచుటకు భయపడక సత్యముకొరకు నియమము ప్రకారము పోరాడి కిరీటము పొందుము (2 తిమొ. 2:5). క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘంలో సభ్యుడవై యుండుము.

—పాల్ గూటం, గొల్లపల్లి.

---

సంక్షిప్త ప్రసంగము:

## క్రైస్తవు డెవరు?

*( Who is a Christian ? )*

అపొ. కా. 11:26; 26:28; I పేతురు 4:16; యెష. 62:2.

**పరిచయము:**

"క్రైస్తవుడను పేరును గూర్చి లోకం గందరగోళంగా యుంది.

"ఆ పేరు ఒక వ్యక్తిదేగాని ఒక దేశానిదిగాని, సంఘానిది గాని కాదు.

"సంఘం క్రీస్తుది గాని క్రైస్తవసంఘం కాదు.

**క్రైస్తవులు కానివారు:**

A) సత్పురుషులందరు క్రైస్తవులు కారు:

నైతిక సద్వర్తన క్రైస్తవుని లక్షణమే గాని, దాని వలన మాత్రమే ఒకడు క్రైస్తవుడు కాజాలడు.

కొర్నేలి సద్వర్తనుడే అయినను, అతడు రక్షణ పొందవలసి వచ్చింది. అపో. కా. 10, 11 అధ్యా.

మంచివాడనబడే వానికికూడ రక్షణ అవుసరం.

B) భక్తిపరులందరు క్రైస్తవులు కారు:

ఏథెన్సు పురప్రజలు బహు భక్తిగలవారు. అపో. కా. 17 : 22

అన్నిమతాల్లోను భక్తిపరు లున్నారుగాని వారి భక్తి సద్భక్తి కాదు. యాకోబు 1:26.

C) మతశాఖలవారు క్రైస్తవులు కారు:

ఏదో ఒక సంఘంలో (శాఖలో) చేరిపోతే క్రైస్తవులమై పోలేము.

క్రీస్తు తన స్వరక్తం యిచ్చి తన సంఘాన్ని కొన్నాడుగాని ఒక శాఖను కాదు. అపో. కా. 20:28.

**క్రైస్తవు డనగా ....**

A) ఒక నూతన సృష్టి. 2 కొరింథి 5:17.

అతడు క్రొత్తగా జన్మించినవాడు. యోహాను 3:3-5.

క్రొత్త జీవితాన్ని జీవించేవాడు. కొలస్స 3:1-9.

క్రీస్తు రాజ్యపౌరుడు. కొలస్స 1:13.

B) క్రీస్తు శరీరంలో ఒక అవయవము. 1 కొరింథీ 12:20 ఒకని కొకరు అవయవముల వంటివారు. రోమా 12 : 5. శరీరమే సంఘము గనుక క్రైస్తవుడు క్రీస్తు సంఘసభ్యుడు. ఎఫెసీ 1:23.

మతశాఖలతో పొత్తులేనివాడు. 2 కొరింథీ 6:18.

C) క్రీస్తులో యున్నవాడు:

క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినవాడు. రోమా 6:3, 4; గలతీ 3:27; 1 పేతురు 3:21.

ఆయనతో పాతిపెట్టబడి ఆయనలో లేపబడినవాడు. కొలస్స 2:12.

క్రైస్తవుడు మరణపర్యంతము క్రీస్తులో నిలిచి యుండువాడు. యోహాను 15:4; ప్రకటన 2:10. —రోలేండ్ ఆండ్రూస్.

# దేవుడు మనకు తోడు

"ఏలయనగా మనకు శిశువు పుట్టెను...బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి... అని ఆయనకు పేరు పెట్టబడును" (యెషయా 9:6). "కన్యక గర్భవతియై కుమారుని కని, ఆయనకు ఇమ్మానుయేలు అను పేరు పెట్టును" (యెషయా 7:14). "ఇమ్మానుయేలు అను పేరునకు దేవుడు మనకు తోడు అని అర్థము" (మత్తయి 1:23).

"దేవుని పొందు ధన్యకరము" (కీర్త 73:28). "ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందును" (మత్తయి 18:20). "నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో ఉన్నాను" (మత్తయి 28:20). "...నేను వారిలో నివసించి సంచరింతును; నేను వారి దేవుడనై ఉందును" (2 కొరింథీ 6:16).

"ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసినయెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము" (ప్రకటన 3:19, 20). "...మిమ్మును మీరే పరీక్షించుకొనుడి; మీరు భ్రష్టులు కానియెడల యేసుక్రీస్తు మీలో ఉన్నాడని మిమ్మును గూర్చి మీరే ఎరుగరా?" (2 కొరింథీ 13:5).

—ప్రభుదాస్

---

గమనిక :—మీ అడ్రసులో మార్పు వచ్చినా, మీరు మాకు M. O. పంపినా లేదా ఒకటికంటె ఎక్కువ సత్యవాక్య కాపీలు మీకు వచ్చుచున్నా దయచేసి మీ అడ్రసు ప్రక్కన ఉన్న నంబరును మాకు తెలపండి. ఇది అత్యవసరం!!

# ప్రకటన గ్రంథంలో ధన్యతలు

1. చదువువాడును, వ్రాయబడిన సంగతులు గైకొనువారును ధన్యులు (1:3).
2. ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు (14:13).
3. మెలకువగా ఉండి తన వస్త్రము కాపాడుకొనువాడు ధన్యుడు (16:16).
4. గొర్రెపిల్ల పెండ్లి విందుకు పిలువబడినవారు ధన్యులు (19:9).
5. మొదటి పునరుత్థానములో పాలు గలవారు ధన్యులు, పరిశుద్ధులు (20:6).
6. ఈ గ్రంథములోని ప్రవచన వాక్యములను గైకొనువాడు ధన్యుడు (22:7).
7. జీవ వృక్షమునకు హక్కు గలవారై గుమ్మములగుండ ఆ పట్టణము లోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు (22:14).

—(**Seed for the Sower** నుండి సేకరణ)

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To
........................
........................
........................
........................